# సిద్ధార్థ



శ్రీశార్వరి

# సిద్ధార్థ



**1**

**2500 సంవత్సరాలకు పూర్వం ...**

బౌద్ధం చప్పన్న దేశాలకు వ్యాపిస్తున్న దశలో పుట్టిన మగపిల్లలకు ఊరూ వాడా 'గౌతమ' అనో, 'సిద్ధార్థ' అనో ముచ్చటపడి తల్లిదండ్రులు పేర్లు పెట్టుకుంటున్న శుభ తరుణం. శ్రావస్తి నగరానికి పదికోసుల దూరంలో ఒక పల్లె. ప్రతి ఇల్లు త్రిశరణాలను త్రికాలాలలో జపిస్తున్న సంధియుగంలో–

అవంతిక అనే అగ్రహారంలో జరిగిన కథ :

అడవి మధ్య నది ... నది ఒడ్డున అగ్రహారం. ఆ రోజుల్లో ప్రతిరాజ్యంలో బ్రాహ్మణ ప్రాబల్యం ఎక్కువ. అడవికి నదికి నడుమ అవంతిక అగ్రహారం. అగ్రహారంలో పరమ శ్రోత్రియ కుటుంబంలో పుట్టినవాడు సిద్ధార్థుడు.

గౌతమ సిద్ధార్థునిపై ప్రేమతో, అభిమానంతో, బౌద్ధం పట్ల అనురక్తితో కుర్రవాడి పేరు సిద్ధార్థ అని పెట్టుకున్నారు తల్లిదండ్రులు. పిల్లల్ని కన్న తల్లిదండ్రులు తమ బిడ్డలు ప్రయోజకులు కావాలని ఆశిస్తారు. మగపిల్లల్ని ఇష్టమైన దేవుని పేర పిలుస్తారు. ఏ మహర్షి పేరో, మహాత్ముని పేరో, గోత్ర ఋషి పేరో పెట్టుకుంటారు. ఆ వేద పండితుడు తన కుమారుని పేరు 'సిద్ధార్థ' అని పెట్టుకోవడంలోనే అతని అభ్యుదయం తెలుస్తుంది. తన కొడుకు గౌతమ సిద్ధార్థుడంతటివాడు కావాలని ఆకాంక్ష కావచ్చు.

పల్లెల్లో పిల్లలకు పనులు తక్కువ. చదువులు అంతంతమాత్రం. ఏ వేద పండితుని వద్దనో సంస్కృతం నేర్చి చదువరి అనిపించుకుంటారు. ఉపనయనం తర్వాత వేదపాఠం తప్పనిసరి. ప్రాయం వచ్చేవరకు పిల్లలకు ఆటలే ఆటలు. నదీ తీరంలో ఆటలు, అడవిలో తిరుగుళ్లు. రేవులో నిలిచే రహదారి పడవలలో సయ్యాటలు. అడవి సాక్షిగా, నదీజలాల సాక్షిగా, మఱ్రిఊడ సాక్షిగా బ్రతకడమే జీవనం.

★ ★ ★

**అందమైన కుర్రవాడు సిద్ధార్థ. అతని వయసు వాడు గోవిందుడు.**

ఇద్దరు అపూర్వ సహోదరులు. రామ లక్ష్మణులు. ఇద్దరి చెలిమి ఇతరులకు అసూయ పుట్టించేది. ప్రేమలు ఎట్లా ఏర్పడతాయో, మైత్రీ సుమాలు ఎప్పుడు విరబూస్తాయో ఎవరూ చెప్పలేరు!

రోజూ చేసిన పనులే చేయడం ... విసుగ్గా ఉంది.

ఉదయం నదీ స్నానం. ఒడ్డున కూర్చుని సంధ్యావందనం. తర్వాత కంఠతా వచ్చిన శ్లోకాలు చదవడం. మామిడి తోటల్లో ఆటలు, ఇంటిదగ్గర మడి, ఆచారం. అంగవస్త్రాలు, తడిబట్టలు, మడి భోజనాలు. ఇంట్లో ఉన్నంతసేపు తల్లిగారి మడులు, ఆచారాలు, నిష్ఠలు, నైవేద్యాలు. తండ్రిగారి వేదపారాయణలు, పురాణ కథనాలు. బయటికి వెళితే కులం వాళ్లతో తప్ప అందరితో కలవడానికి లేదు. ఒకే ఈడువారి మధ్య ఈ తేడాలు ఎందుకు? బుద్ధిమంతుడు అన్న పేరు వచ్చినా సిద్ధార్థలో బండతనం ఎక్కువైంది.

నది ప్రక్కన సాయంత్రం వేళల్లో వచ్చీపోయే పడవలు ఆసక్తితో గమనించడం ఒక ఆట. అప్పుడప్పుడు బౌద్ధ సన్యాసులు పడవ దిగుతుంటారు. వాళ్లు ఎక్కడ నుండి వస్తారు? ఎక్కడికి పోతారు? వాళ్లు సన్యాసులే అయినా గమ్మత్తుగా ఉంటారు. చిత్రంగా పిల్లుల్లా నడుస్తారు. ఒకేమాట – ఒకేమాట. విచారించాడు. వాళ్ల పట్ల ఆసక్తి కలిగింది. వారికి కులాల పట్టింపులు లేవట. మడి ఆచారాలు లేవట. అడవిలో అందరూ కలిసిమెలిసి జీవిస్తారట. సంస్కృతం చదవరట. వేదం ముట్టరట. రోజూ మౌనంగా అనుష్ఠానం చేస్తారట. ఏమిటో వాళ్ల పద్ధతులు నచ్చేస్తున్నాయి! ఈ అగ్రహారంలో మడి కట్టుకుని మైల వాళ్లలా బ్రతకటం కన్న అడవిలో బౌద్ధ సంఘభిక్షులుగా బ్రతకడం బావుంటుంది.



# 2

మిత్రద్వయం అడవిదారుల్లో నడిచినడిచి అలసిపోయి, శ్రవణ విహారం చేరుకున్నారు. శ్రవణ విహారం ఒక విధంగా సన్యాసుల మఠం. గురు పీఠంలో ఉన్న వృద్ధ శ్రవణునికి తమను గురించి తెలియచేసి, తమకు దీక్ష అనుగ్రహించమని అర్థించారు. ఇద్దరూ నూనూగుమీసాల యువకులు. చదువుకున్నవారు. విద్యా బుద్ధులున్నవారు. గురు శ్రవణుడు వెంటనే వారిని తమ కూటమిలో చేర్చుకున్నాడు. సిద్ధార్థుని కోరిక తీరింది.

సిద్ధార్థుడు తను ధరించిన బట్టలు ఒక పేదవానికి దానం చేసి, శ్రవణ ఆచారం ప్రకారం అందించిన అంగవస్త్రం ధరించాడు. కొత్తగా వచ్చినవారు ఏకాంబరులు కావాలి. అంగవస్త్రం తప్ప పైన ఉత్తరీయం ఉండదు. ఎండకు ఎండుతూ, వానకు తడవవలసిందే. అదీ మట్టిరంగు అంగవస్త్రం. ఆశ్రమ జీవనానికి అది మొదటిగుర్తు. రోజూ భిక్షాటన చేసి ఒకపూట భోజనంతో తృప్తిపడవలసి ఉంటుంది. స్వయంపాకం నిషేధం. భిక్ష లభించకపోతే ఉపవాసం తప్పనిసరి. ఒకసారి సిద్ధార్థుడు ఏకబిగిన పక్షంరోజులు ఉపవసించాడు. మరొక మారు నెలరోజులు భోజనం లేదు. కఠోర నియమాలు. సరైన భోజనం లేక శరీరం శుష్కించిపోయింది. పసిమిఛాయ శరీరం నల్లకప్పేసింది. ఎండలో తిరగడం వల్ల పై భాగం కమిలిపోయింది. శరీరం శుష్కించినా, కాళ్లు, చేతులు సన్నపడినా దిగులు పడలేదు. శరీరంపై వ్యామోహం

తగ్గిపోయింది. ఆ నియమనిష్ఠలతో ఎవరికీ దేహంపై ప్రేమ మిగలదు. గోళ్లు పెరిగాయి. గడ్డం జుత్తు పెరిగి సంస్కారం లేక పిచ్చిగా తయారైంది. ఉపవాసాల వల్ల కళ్లు లోతులకు పీక్కుపోయి కళా కాంతుల్ని కోల్పోయాయి. ఆడవారు కనిపిస్తే సిగ్గుతో తలదించుకోవాలనిపిస్తోంది. అనాకారిగా, అనాగరకంగా మారిపోయాడు.

ఒకప్పుడు సిద్ధార్థ వీధిలో నడుస్తుంటే రాజసంగా ఉండేది. అందరూ నిలబడి చూచేవారు. కన్నెపిల్లల చూపుల్లో ఆరాధన పొంగిపొర్లేది. అతనిని చూడడం ఒక శుభసూచనగా భావించేవారు. ఇప్పుడు అతను కనిపిస్తే అపశకునం అని మొహాలు తిప్పుకుంటున్నారు. తనలో ఎంత మార్పు. ఇప్పుడు ఆడపిల్లలు తనవైపు ఆరాధనగా చూడరు. ఎవరూ గౌరవంగా చూడడం లేదు. తన చూపుల్లో ప్రత్యేకత లేదు. తనలో ఇదివరకున్న ప్రత్యేకతలు లేవు. తనది నరక జీవనం. నికృష్ట బ్రతుకు.

ఇప్పుడు సిద్ధార్థుని లక్ష్యం ఒక్కటే. తనలో ఏ ఇతర ఆశలు లేవు. ఆశయాలు లేవు. కోరికలు లేవు. కలలు కనడు. కామనలు లేవు. తనపైన సుఖదుఃఖాల ముద్రలుపడవు. వాటి నీడ సైతం తనపైన పడదు. ఇప్పుడు తను నడిచేశవం. తను జీవచ్ఛవం. తనను తాను హరింపచేసుకుంటూ ఏదో లక్ష్యంవైపు ప్రయాణం సాగిస్తున్నాడు. తన గుండె ఎండిపోయింది. హృదయం స్పందించదు. తన హృదయం శూన్యంలో నిండిపోయింది. తనకు ఎప్పటికైనా జ్ఞానోదయం అవుతుందన్న చిరుఆశ. అది తన ఆశయం. ఆత్మ జాగృతం కావాలి. అందుకు ఎన్ని కష్టాలైనా భరించడానికి తను సిద్ధం.

గ్రీష్మ తాపానికి శరీరం కనలిపోతున్నది. వర్షాలకు తడిసి ముద్దవు తున్నాడు. చలికి వజవజ వణికిపోతున్నాడు. ఆకలిని సహించడం అలవాటైంది. ప్రాణావశిష్టంగా బ్రతుకు సాగుతోంది. శరీరానికి ముళ్లు గుచ్చుకున్నా నొప్పిలేదు. లోపల రక్తం ఉంటే గదా! రక్తం ఎప్పుడో ఎండిపోయింది. తోలుకప్పుకున్న ఎముకలపోగు తన శరీరం.

అంతగా కృశించిపోయిన శరీరానికి పెద్దగా శ్వాసక్రియ అవసరం లేదు. ప్రాణం నిలవడానికి మాత్రం శ్వాస సాగుతోంది. శ్వాసించకపోయినా



# 3

శ్రావస్తి నగరం.

నగర శివార్లలో జేతవనం.

జేతవనం గౌతమ బుద్ధుని ఆవాసం.

శ్రావస్తి నగరంలో పసిపిల్లలకు సైతం బుద్ధ భగవానుడు తెలుసు. జేతవనంలో ఉండే భిక్షులతో కలిసి బుద్ధుడు ప్రతిరోజు నగరానికి భిక్షార్థం వచ్చినప్పుడు పిల్లలు సైతం ఆసక్తిగా చూచేవారు. బౌద్ధ భిక్షుల రాకకోసం ప్రతి ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి. వారు 'భవతి భిక్షాన్ దేహి' అని అర్థించరు. నెమ్మదిగా, నిశ్శబ్దంగా, వీధిలో నడిచిపోతుంటారు. క్షణం సేపు గుమ్మం ముందు నిలబడతారు. వారి రాకను గుర్తించి ఇల్లాలు భిక్ష సమర్పిస్తుంది. వారి కోసం తెల్లవారే సరికి వంటలు సిద్ధం చేస్తారు. అనంత పిండిక అనే వ్యాపారి బౌద్ధ అభిమానిగా మారి, తన ఉద్యానవనాన్ని బుద్ధునికి, ఆయన శిష్యవర్గానికి సమర్పించుకున్నాడు. అక్కడే గౌతమ బుద్ధుడు ప్రధానంగా ఉండేది.

సిద్ధార్థుడు గోవిందుడు బుద్ధుని కథలు విని ఆకర్షితులై బుద్ధుని దర్శించాలన్న సంకల్పంతో శ్రావస్తికి చేరుకున్నారు. నగరంలో ప్రవేశించి ముందు ఒక ఇంటి ముంగలకు రాగానే వారి ఆహార్యం చూచి బౌద్ధ భిక్షులని

భావించిన ఇంటి ఇల్లాలు భిక్ష సమర్పించింది. శుభసూచన. కడుపు నిండుగా భోజనం చేశారు మిత్రద్వయం.

తమ ఆకలి తీర్చిన ఇల్లాలికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ సిద్ధార్థుడు ప్రశ్నించాడు. "అమ్మా! బుద్ధ భగవానుడు ఉండేదెక్కడ? వారి దర్శనం కోసం దూరం నుండి వచ్చాం. మేము అరణ్యాలలో ఉండే శ్రవణులం తల్లీ! మేము బౌద్ధ భిక్షులం కాదు, బుద్ధుని దర్శనం కోసం వచ్చాం. గౌతముని బోధనల వినాలని మా సంకల్పం."

ఆ ఇల్లాలు సంతసించింది, "మీరు భగవాన్ బుద్ధుని అభిమానులే గదా! సంతోషం. భగవాన్ భిక్షులతో జేతవనంలో ఉంటారు. నగరం చివర జేతవనం ఉంది. వెళ్లి బుద్ధదేవుని దర్శించండి. ఎవరి నడిగినా దారి చూపిస్తారు. వెళ్లిరండి."

ఆమె మాటలకు గోవిందుడు పరవశించాడు. బుద్ధుని బోధలు విన్నంత తృప్తి చెందాడు. "అమ్మా, మీరు బుద్ధుని స్వయంగా చూచారా?" అడిగాడు.

"చాలాసార్లు వారిని దర్శించాను బాబూ. ఈ నగరంలో బుద్ధుని చూడనివారు, వారి అమృతవాక్కులు విననివారు ఉండరు. ఆయన చాలాసార్లు మా వీథిలో వెళ్లారు. నేను చాలాసార్లు భిక్ష ఇచ్చే అదృష్టం కలిగించారు. ఆయన కావిరంగు బట్టలు ధరించి ఉంటారు. నిర్మలమైన ముఖంపై చిరునవ్వు, ప్రశాంతంగా నడుస్తారు. ప్రశాంతగా మాట్లాడతారు. అదే గుర్తు వారిని గుర్తించడానికి. చేతిలో భిక్షాపాత్రతో నడిచి వస్తుంటే సాక్షాత్తు భగవంతుడే దిగి వచ్చాడా అనిపిస్తుంది. పాత్ర నిండగానే తిరిగి జేతవనానికి వెళ్లిపోతారు."

ఆ ఇల్లాలి మాటలు గోవిందుకు నోటిలో అమృతం పోసినట్లయింది.

ఇంకేవో ప్రశ్నించబోగా సిద్ధార్థ వారించి 'పదపోదాం' అన్నాడు.

★ ★ ★

ఎవరినీ విచారించకుండానే, కావిరంగు వస్త్రధారులను గమనిస్తూ జేతవనం చేరుకున్నారు. జేతవనం చేరేసరికి చీకటి పడ్డది. ఎక్కడెక్కడి నుండో వచ్చేవారు వందల సంఖ్యలో వనప్రస్థం చేశారు. ఉద్యానవనం కోలాహలంగా ఉంది. వచ్చే అభిమానులకోసం పర్ణశాలలు సిద్ధంగా ఉన్నాయి. వెన్నెల్లో



# 4

**జే**తవనం వదిలి బయటకు వచ్చాడు సిద్ధార్థ.

అప్పటికి గౌతమబుద్ధుని ఆవాసం జేతవనం.

సంఘ సభ్యులు, అభిమానులు, దర్శకులు అక్కడికే వస్తారు.

రోజూ బుద్ధభగవానుని ప్రవచనాలు విని సేద తీరుతుంటారు. తన చిరకాల మిత్రుడు గోవిందుని బౌద్ధ ధర్మానికి వదలి తను బయలుదేరాడు. జ్ఞానమూర్తి అయిన బుద్ధుని బోధనలు నచ్చక బయటపడ్డాడు. జేతవనంలోనే తన గతాన్ని వదిలి 'అగతం'లోకి బయలుదేరాడు. మనస్సు కకావికలైంది. ప్రాణం నుండి తను వేరైన భావం. తన నుండి ఏదో జారిపోయిన వివశత. మనస్సు శూన్యం అవుతోంది. తన గతం సైతం తనని వదిలిపోయింది. తనకు దూరమైంది గతం. ఇప్పుడు సిద్ధార్థలో గతం జ్ఞాపకాలు లేవు. తనలో భావశూన్యత. గతమంతా కరిగి శూన్యంలో కలిసిపోయిన భావన. అనుభూతి.

ముందుకు అడుగు వేసినకొద్దీ తనలో శూన్యత గడ్డ కడుతోంది. లోతు తెలియని నీటిలో మునిగినట్లు, నేలపై కాలు ఆనడం కోసం ఇంకా లోతుల్లోకి వెళుతున్నట్లు, తనలోని లోతుల్లో వెదుకులాట. కాలికి నేల అందడం లేదు. శూన్యంలో ఆలోచనలు నిలవడం లేదు. ప్రతి అనుభూతికి ఆధారం ఒక అనుభవం. ప్రతి అనుభవానికి ఒక సంఘటన ఆధారం. ఆ సంఘటనకు

ఒక ప్రేరణ కారణం. ప్రేరణకు మనస్సు కారణం. ఆ మనస్సు శూన్యమైతే ఏవీ మిగలవు. తను కారణాలను శూన్యంలో వెతుకుతున్నాడు. అవి వాస్తవరూపం దాల్చి అనుభవాలు కాగలుగుతాయా! అనుభూతుల్ని మిగుల్చుతాయా? చెప్పలేం. ఆ స్పందనలు లోవెలుగులై బయటకు తొంగి చూస్తున్నాయి. గుండెను చీల్చుకుని బయటికొస్తున్నాయి.

నడకసాగుతోంది నెమ్మదిగా. మనసు తొందరపెట్టడం లేదు. మనసుకే మార్గం లేదు. తనకేం చూపిస్తుంది మార్గం. తనను ఎలాగ నడిపిస్తుంది ముందుకు. తనలో తను అనుకోసాగాడు.

“నేను ఇప్పుడు పసివాడిని కాను. యువకుడి నైనాను. బాల్యం వదలి పోవడం అంటే సర్పం కుబుసం వదలడం. వదిలిన కుబుసాన్ని సర్పం పట్టించుకోదు. ఇప్పుడు తనకు బాల్యం వదిలిన కుబుసం లాంటిది. అది తిరిగి రాదు. ఇంతకాలం తన ఎదుగుదలకు గురువులు, బోధనలు అవసరం అయింది. ఇప్పుడు గురువుల అవసరం లేదనిపిస్తోంది.

“తనకు చదువులు నేర్పిన గురువుల్ని, నీతులు చెప్పిన పరిజనాన్ని వదిలించుకున్నాడు. చివరకు మహా గురువైన గౌతమ బుద్ధుని బోధనలూ తనకు నచ్చలేదు. బుద్ధుని ఆశ్రయించినా బుద్ధి కలగలేదు. జేతవనాన్ని, బుద్ధుని, తన మిత్రుణ్ణి వదలి ఒంటరిగా వచ్చాడు. బుద్ధుని సిద్ధాంతాలు సైతం ఆచరణీయం కాదని తోచింది.”

మనసు బాటల్లో నడుస్తూ తనను విశ్లేషించుకోసాగాడు!

“ఏమిటీ విచిత్రం? గురువుల్ని కాదని తానేం చేయాలి. ఎవరి బోధలు, పద్ధతులు తనకు నచ్చలేదు. ఏం చేయాలి?

“నేనంటే ఎవరు? అసలు ‘నేను’ అంటే ఏమిటి?

“మనిషి చదువులు, సంధ్యలు, యోగం, తపస్సు అన్నీ ఎందుకోసం? ఆత్మను తెలుసుకోడానికే గదా. ఆత్మను తెలుసుకోవడం అంటే నన్ను నేను తెలుసుకోవడం. నన్ను నేను తెలుసుకోడానికి గురువులెందుకు? గురువులది మోసం, నాదీ మోసమే. నన్ను నేను మోసగించుకొని నాకు దూరంగా పారిపోతున్నానా? ఎక్కడికని పోగలను? నాలో ఉన్నది నేను. నేనులో ఉన్నది



# 5

**బ్రతుకుబాటలో ప్రతి మలుపులోను వింతలు, విడ్డూరాలు ఉంటాయి.** సిద్ధార్థుడు ప్రతి మలుపులో కొత్తకొత్త జీవిత సత్యాలను తెలుసుకుంటున్నాడు. లోకం ఎంతో మారింది. కొత్తగా కనిపిస్తోంది. తన మనసు ఆనందంతో పరవళ్లు తొక్కుతోంది. హృదయం పరవశిస్తోంది. దూరాన పర్వతాలపైన సూర్యోదయం కొత్తగా అనిపిస్తోంది. ఎంత సుందరదృశ్యం – సూర్యోదయం, అరణ్యాలు, తోటలు, చెట్లు ఎంత అందంగా ఉన్నాయి. ఆకాశంలో చంద్రవంక ఎంత బావుంది. లోకం ఎందుకింత అందాలు విరబోస్తోంది. కొండలు మిట్టలు, నదీ నదాలు, ఊళ్లూ పూళ్లు, పక్షుల కిలకిలలు. కలరవాలు. మనసును పరవశింప చేస్తున్నాయి.

సూర్యచంద్రుల ప్రయాణం రోజూ జరిగేదే. నదీనద ప్రవాహాలు ఎప్పుడూ ఉన్నవే. మధుకరుల ఝుంకారం అప్పుడు, ఇప్పుడు అంతే గదా. అన్నింటిలో ఇంతకుముందు కనిపించని అందాలు ఇప్పుడు కనిపిస్తున్నాయేం! ఏమిటీ ఆకర్షణ? ఇవన్నీ అశాశ్వతాలా? ఎట్లా నమ్మటం? ఇవన్నీ లేనివని సరిపెట్టుకోవడం ఎలా? కంటికి కనిపిస్తున్నాయి. మనసును ఉద్దీప్తం చేస్తున్నాయి. దృశ్య ప్రపంచం చాటున అదృశ్యానందం ఉంది. అది మాత్రమే నిజం, శాశ్వతం! దృశ్యమే లేకపోతే అదృశ్యానుభూతి ఎలా సాధ్యం? ఆ రహస్యం తెలుసుకోవాలి. అది అన్వేషించాలి. అదృశ్యం అంటే దృశ్య ప్రపంచం

వెనక ఉన్న శక్తి. ఇవన్నీ అందంగా ఉన్నా శాశ్వతం కాదు. ఎండకు తలబొప్పి కడుతుంది. అరణ్యం చల్లగా ఉంటుంది. ప్రతిక్షణం గతంలోకి జారిపోతుంది. ఏదీ నిలవదు. దేనికీ నిలకడలేదు.

పరుగెత్తే ప్రవాహం పైన జీవిత నావ. నావ నిండా సంపదలు. చెట్ల కొమ్మలపై కోతి కొమ్మచ్చి ఆటలు. చిలుకా కోకిలల సరాగాలు విహారాలు. ఒకచోట ఒక ఆడ గొర్రె మగ గొర్రె సంభోగ క్రియ. పూలపైన వాలే తుమ్మెదలు. మకరంద ఆస్వాదనలు, నీళ్లపైకి ఎగిరే చేపలు. ఇదంతా జీవితం. మదిలో కలవరం.

అన్నీ ఎప్పుడూ ఉన్నవే. ఎప్పుడూ ఉండేవే. అయితే తనకు తెలియని క్రియలు, తానెరగని అందాలు, తన అనుభవానికి అందనివి ఇప్పుడు అనుభూతించడానికి కారణం.

జేతవనం అనుభవాలు స్ఫురణకొచ్చాయి. బుద్ధ భగవానుని ప్రసంగం విన్నది జేతవనంలోనే. మిత్రుడు గోవిందును వదిలింది జేతవనంలోనే. బుద్ధునితో చర్చించింది అక్కడే. అన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి. మరచిపోనివి గతకాలపు అనుభవాలు మాత్రమే.

అప్పుడు తనకీ ప్రపంచం తెలియదు. అప్పటి లోకం అదే. గౌతమ బుద్ధునితో నేను విభేధించానా? బుద్ధుని విజయ రహస్యం ఆయన ప్రసంగాలలో లేదు. అసలు ధ్యాన రహస్యం ఆయన చెప్పలేదు. అదే నా దుగ్ధ. జ్ఞానోదయవేళ ఆయన మనసు ఎట్లా ఉంది? ఎంతో కల్లోలం అనుభవించి ఉంటుంది. తర్వాత అంతా ప్రశాంతత. ఆయన ఎంత క్షోభపడి ఉంటాడు. ఎంత బాధ అనుభవించి ఉంటాడు. అంతబాధకు లోనుకాకుండా, క్షోభ పడకండా జ్ఞానం కలుగుతుందా? రహస్యం విప్పి చెప్పడు. ఎవరూ చెప్పరు. అది జ్ఞాన ప్రసవవేదన. ఎవరి అనుభవం వారిది. ఎవరి బాధ వారిది. బాధలేని ప్రపంచం ఎలా సాధ్యం. బుద్ధుడు తను బాధపడ్డాడు కదా! అది విస్మరణీయం కాదు. ప్రపంచంలో బాధ ఉండితీరాలి. బాధ దాటిన తర్వాతనే శాంతి ప్రకరణం. తనకు ఎలాంటి బాధలు లేవు. అనుభవాలు లేవు. అనుభవం లేని ఆత్మకు బ్రహ్మాన్ని చేరే అర్హత ఉండదు. బాధల ఆవలితీరం బ్రహ్మం.



# 6

**సి**ద్ధార్థుడు కమల చెప్పిన కామస్వామిని కలవడానికి బయలుదేరాడు.

అతని నివాసం ఒక రాజభవనంలా ఉంది.

అనేకమంది చారకులు, పరిచారికలు, ఉపచారికలు తన రాకకు ఎదురు చూస్తున్నట్లు సేవకులు తనను చూడగానే సగౌరవంగా లోపలకు ఆహ్వానించారు. అనేక మందిరాలు, మండపాలు దాటించి అంతర్మందిరంలోకి తీసుకువెళ్లారు. అన్ని గదుల్లోనూ విలువైన తివాచీలు పరచి ఉన్నాయి. చాలా ఖరీదైన భవనం.

విలువైన మనుషులకు ఖరీదైన భవనాలు సహజం.

కమల భవనం చాలా విలువగలది. కమలకు తెలిసినవారు ఖరీదైన వారే గదా.

చివరగదిలో పట్టుపరుపులు పరచి ఉన్నాయి. తనని అక్కడ నిలిపి, చారుడు లోపలికి వెళ్లాడు స్వామితో చెప్పడానికి. అంతలో కామస్వామి బయటకు రానే వచ్చాడు. పొడవైన వ్యక్తి. ముసలితనం మీద పడుతున్నా, పడుచువాడిలా కనిపించాలన్న తాపత్రయం అతని వేష, భూషణాల్లో కనిపిస్తోంది. వేళ్లకు రత్నాల ఉంగరాలు. మెడలో బంగారు గొలుసు. పట్టు బట్టలు, ఠీవి, దర్పం తెచ్చి పెట్టుకున్న నగలు చూడగానే ఇతడే అతగాడు, కమల జతగాడు అనుకుని అభివందన చేశాడు.

అవసరానికి గాడిద కాళ్లకైనా నమస్కరించక తప్పదు?

కామస్వామికి ఎదురుగా వినయంగా కూర్చున్నాడు సిద్ధార్థ.

"నీవు బ్రాహ్మణుడివని, చదువుకున్నవాడివని విన్నాను. నిజమా! నా దగ్గర పనిచేయాలనుకుంటున్నావు. అవునా? ఏం దివాలా తీశావా! పొట్టకోసమా ఉద్యోగం? నీ మొహంలో దివాలాతనం కనిపిస్తోంది."

నాలుగు ముక్కల్లో జీవితం విశ్లేషించాడు కామస్వామి.

"నేనేమీ దివాలా తీయలేదు. ఓటమి అన్నది నా జాతకంలో లేదు. ఇప్పటివరకు శ్రవణ సంఘజీవిని."

తన ఆకారం వికారంగా ఉండడానికి కారణం విశదపరిచాడు.

"శ్రవణ సంఘం నుండి వస్తే పనికిమాలిన వారనే అర్థం. సన్యాసులు ఏ పనికీ పనికిరారు ... భిక్షాటనకు తప్ప. అయినా శ్రవణులందరూ దరిద్రులే కదా ఎందుకా రుసరుస?"

"సంపద ఉండడం ఒక్కటే యోగ్యత కాదు. వస్తు వాహనాలు బ్రహ్మ పదార్థాలు కావు. నా యోగ్యత నాకుంది."

"డబ్బు లేకపోవడం ఒక్కటే నీ యోగ్యత. చేతిలో చిల్లిగవ్వ లేనివాడివి. ఏం వ్యాపారం చేస్తావయ్యా" కామస్వామి వెక్కిరింత.

"ఆ విషయం ఇంతవరకు ఆలోచించలేదు స్వామీ. ప్రతి పనికీ ధనం అవసరమని తెలియదు."

"ధనమూలం మిదం జగత్ – వినలేదా! తెలియదా!"

"జీవించడానికి ధనమే ప్రధానం కాదు స్వామీ."

"ఇతరుల సంపాదనతో బ్రతికేవారికి డబ్బు విలువ తెలియదు."

"కావచ్చు. ఎంత పెద్ద వ్యాపారి అయినా, ఇతరులు కష్టంపై ఆధారపడ వలసిందే కదా?"

"వ్యాపారి ఇతరుల సొమ్ము అన్యాయంగా తీసుకోడు. వ్యాపారంలో తీసుకున్న డబ్బుకు సరిపడా వస్తువులు ఇస్తాడు."

"కావచ్చు స్వామీ! ప్రతివాడు ఇస్తుంటాడు. పుచ్చుకుంటాడు. ప్రతి మనిషి జీవితం వ్యాపారమే కదా!"



# 7

**చా**లాకాలం పాటు బంధాలు లేని సంసార జీవితం గడిపాడు. సొంత ఇల్లు, ఇల్లాలు లేని సంసారి. సమాజంలో అంటీ ముట్టునట్లు జీవిక సాగించాడు. శ్రవణ జీవితంలో కాల్చి అణచివేసిన వాంఛల్ని పైకి లాగి పుష్కలంగా అనుభవించాడు. త్రుంచివేసిన కోరికలు తర్వాతి కాలంలో కొత్త చివుళ్లు వేశాయి. కామనలు బుసకొట్టాయి. జీవితం రెండవదశ మూడుపూలు ఆరుకాయలు. అంతులేని సంపదలు, అదుపులేని శృంగారజీవితం. ఆనాటి అనుభూతులు ఇంకా పచ్చిగా ఉన్నాయి. అనుభవాలు జీవితానికి సంపూర్ణత్వం అందించాయి.

నిజంగా సిద్ధార్థకు తెలిసిన విద్యలు మూడు.

ఆలోచన, ఉపవాసం, నిరీక్షణ.

అవి బాగానే ఉపకరించాయి. సత్ఫలితాల నిచ్చాయి.

లోకంలో అమాయకత్వం యావత్తు సామాన్య ప్రజల్లో దర్శించాడు. వారి స్నేహం తనకు ఆసరా అయింది. తను వారితో మమేకమైనాడు. వారి కష్ట సుఖాలతో భాగం పంచుకున్నాడు. అది గతకాలం.

సంవత్సరాలు గడుస్తున్నాయి. వయసు పైబడుతోంది. సుఖాలు ఇబ్బడి ముబ్బడిగా అనుభవిస్తున్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Siddhartha**

* * *